విద్య ప్రతి ఒక్కరి నైతిక హక్కు

ఎన్‌ఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ నెమలి అనిల్‌కుమార్‌


సాక్షి స్కూల్‌ ఎడ్యుకేషన్‌ పేపర్లను విద్యార్థులకు అందజేస్తున్న నెమలి అనిల్‌కుమార్‌

మల్లాపూర్‌: విద్య ప్రతి ఒక్కరి నైతిక హక్కు అని, విద్యార్థులకు నెమలి సురేష్‌ ఫౌండేషన్‌ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎన్‌ఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ నెమలి అనిల్‌కుమార్‌ అన్నారు. నెమలి సురేష్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మల్లాపూర్‌ జిల్లా పరిషత్‌ హైస్కూల్లో 120 మంది 10 వతరగతి విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్‌ పేపర్‌ను సొంత డబ్బులతో అనిల్‌కుమార్‌ పంపిణీ చేశారు. ఏడాది పాటు సాక్షి ఎడ్యుకేషన్‌ పేపర్‌ 120 కాపీలను విద్యార్థుల కోసం ఏడాది చందాను తన సొంతగా రూ. 12 వేల చెక్కు రూపంలో 'సాక్షి' సర్క్యులేషన్‌ ప్రతినిధి భరత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్‌ కుమార్‌ మాట్లాడుతూ సాక్షి ఎడ్యుకేషన్‌ పేపర్‌తో పదవ తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు గతం ఏడాది కూడా సాక్షి ఎడ్యుకేషన్‌ పేపర్‌ను పదవ తరగతి విద్యార్థులకు ఇవ్వాడానికి సహకారం అందించానన్నారు. ఉన్నత లక్ష్యల కోసం విద్యార్థులు శ్రమించాలన్నారు. ఎన్‌ఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ విద్యా విషయంలో మీకు తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరిరెడ్డి, పీఆర్‌.మోహన్‌, కె.రాజేష్‌, మల్లికార్జున్‌, నవీన్‌, హరి, రఘు, విజయ్‌, రఫీక్‌ తదితరులు పాల్గొన్నారు.

'నాటి నడవడి–నేటి ఒరవడి' పుస్తకావిష్కరణ


గొడుగు యాదగిరిరావు రచంచిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత్రి జ్యోతి

కాప్రా: తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్‌ ఆధ్వర్యంలో గొడుగు యాదగిరిరావు రచించిన 'నాటి నడవడి–నేటి ఒరవడి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి పి.జ్యోతి సమక్షంలో కమలానగర్‌లోని సీపీఐ టీయూ కార్యాలయంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గొడుగు యాదగిరిరావు బాల్యం నుంచి వివిధ అంశాలపై చక్కని మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ఆయన రచనలు ఉన్నాయని, విద్యార్థి ఉద్యమం నుంచి ట్రేడ్‌ యూనియన్‌ వరకు సాహిత్యం నుంచి సామాజిక అంశాల వరకు అన్ని రంగాల్లో యాదగిరిరావు తన వంతు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌, భూపతి వెంకటేశ్వర్లు, రమేష్‌, జయరాజ్‌, శివరామకృష్ణ, లీలావతి, పురుషోత్తం, బ్రహ్మం, నరసింహారావు, రామమూర్తి, సౌమ్య, స్వాతి, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ వార్డు కార్యాలయం ఎదురుగా గల్లీలో నూతనంగా భూగర్భ డ్రైనేజీ లైన్‌ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం బస్తీవాసులు మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతం 30 ఏళ్ల క్రితం వేసినా లైన్‌ కారణంగా ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదని దీంతో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో భూమండ్ల శ్రీశైలం, రఘు, మచ్చ శ్రీనివాస్‌ తదితరులున్నారు.


కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బస్తీవాసులు

కమిషనర్‌కు వినతి


జీహెచ్‌ఎంసి కమిషనర్‌ ఆమ్రపాలికి వినతి పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: ఉప్పల్‌ నల్ల చెరువును అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఉప్పల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలికి వినతి పత్రాన్ని అందచేశారు. దీనికి కమిషన్‌ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఉప్పల్‌ నల్ల చెరువు సుందరీకరణ, చుట్టూ ఫెన్సింగ్‌, వాకింగ్‌ ట్రాక్‌, తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కుషాయిగూడ గణేష్‌ ఉత్సవ సమితి చైర్మన్‌గా పాండాల

కుషాయిగూడ: కుషాయిగూడ భజన మందిర్‌ గణేష్‌ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పాండాల శివకుమార్‌గౌడ్‌ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన కుషాయిగూడ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ గత 78 సంవత్సరాలుగా భజన మందిర్‌ ఆధ్వర్యంలో గణేష్‌ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల్లో కుషాయిగూడ వాసులంతా పాలుపంచుకొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్‌, ప్రతినిధులు పాల్గొన్నారు.


గణేష్‌ ఉత్సవ సమితి చైర్మన్‌గా ఎన్నికైన పాండాల శివకుమార్‌గౌడ్‌

బచ్‌పన్‌లో కృష్ణాష్టమి సంబరాలు


బచ్‌పన్‌లో కృష్ణాష్టమి సంబరాలలో చిన్నారులు

హబ్సిగూడ: హబ్సిగూడలోని అకాడమీక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌, బచ్‌పన్‌ ప్లే స్కూల్‌లో శుక్రవారం కృష్ణాష్టమి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌కు చెందిన చిన్నారులు రాధాకృష్ణ, బలరామ కృష్ణులు, గోపిక, దేవకి, వసుదేవుడు వేషధారణలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌ చిలుక శివ్‌కుమార్‌ హాజరై కృష్ణాష్టమి ప్రత్యేకతని వివరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్‌ కల్పన, ఇన్‌చార్జి సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రివేణిలో నేషనల్‌ స్పేస్‌ డే

అల్వాల్‌: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అల్వాల్‌లోని త్రివేణి స్కూల్‌లో చంద్రయాన్‌–3 విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ శ్రీసుధ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల, అంతరిక్ష రంగ శాస్త్రవేత్తల నిరంతర కృషి ఫలితంగా చంద్రయాన్‌–3 గత సంవత్సరం చంద్రుని మీద ల్యాండ్‌ అయి ప్రపంచ దేశాల్లో భారతేశాన్ని చంద్రున్ని చేరుకున్న నాలుగవ దేశంగా భారతదేశాన్ని సమున్నత స్థాయిలో నిలబెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ సీఆర్‌వో వెంకటరావు, సైన్స్‌ అధికారి సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


త్రివేణి స్కూల్‌లో నేషనల్‌ స్పేస్‌ డే వేడుకలు

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన


ఈసీఐఎల్‌లోని ఎన్‌ఎస్‌ఐసీలో ఎస్సీ, ఎస్టీ హబ్‌ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

కాప్రా: దేశంలో యువశక్తిలో అంతర్గతంగా దాగివున్న ఔత్సాహిక పారిశ్రామిక శక్తిని వెలికితీయడం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌, యువకుల కోసం ఈసీఐఎల్‌లోని ఎన్‌ఎస్‌ఐసీలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నేషనల్‌ ఎస్సీ, ఎస్టీ హబ్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు నిర్వాహకులు. ఈ సదస్సుకు ఎన్‌ఎస్‌ఐసీ ఎస్సీ, ఎస్టీ హబ్‌ బ్రాంచ్‌ మేనేజర్‌ సురేష్‌, పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ చీఫ్‌ మేనేజర్‌ రేఖారావు, ప్రైస్‌ చారిటబుట్‌ ట్రస్ట్‌ సీఈవో ప్రభాకర్‌తో పాటు దాదాపు 18 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు.

బస్తీలు, కాలనీల్లో మురుగు పరుగు

- స్పందించని అధికారులు – పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- అంటు వ్యాధుల బారిన ప్రజలు



బస్తీల్లో, కాలనీలో మురుగు పొంగుతున్న దృశ్యాలు

రామంతాపూర్‌: డివిజన్‌ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, ఇందిరానగర్‌ చిన్న చెరువు సమీపంలోని మార్కండేయ దేవాలయం వీధితో పాటు చాలా బస్తీలు, కాలనీల్లో గత రెండు, మూడు నెలలుగా భూగర్భ డ్రైనేజీలు తరచూ పొంగుతూ మురుగు రోడ్లపై ప్రవహించడమే కాకుండా ఇళ్ళలోని సంపులో చేరుతున్నాయి. దీంతో దోమలు విజృంభించి ఈ ప్రాంత ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల ఇంటి ముందు లేక ప్రజాప్రతినిధుల ఇళ్ల ఎదుట ఈ మురుగు ప్రవహిస్తే విధంగానే నిర్లక్ష్య వైఖరి వహిస్తారా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే యుద్ధప్రాతిపదికన ఈ సమస్యను పరిష్కరించాలని లేదంటే కాలనీ సంఘాలన్నీ కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



శ్రీనగర్‌ కాలనీలో నెల రోజుల నుంచి డ్రైనేజీ నుంచి మురుగు పొంగి రోడ్లపై ప్రవహించి ఇండ్లలోకి చేరుతుంది. దీంతో స్థానిక ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తగా పైప్‌లైన్లను ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలి. లేదంటే కాలనీ, బస్తీ సంఘాలు ఆందోళన చేపడుతాం.

– దండు సంతోష్‌, అధ్యక్షుడు, శ్రీనగర్‌ కాలనీ

27న పిల్లల ఉపకరణాల కోసం శిబిరం

మల్కాజిగిరి: వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలతో చదువుతున్న విద్యార్థులతో పాటు ఇతర చిన్నారులు ప్రత్యేక అవసరాలు (సీడబ్ల్యుఎస్‌ఎన్‌) గల వారికి ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 27వ తేదీ మల్కాజిగిరిలోని బాలుర పాఠశాలలో గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు సదరం సర్టిఫికెట్‌, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్‌, ఇతర డాక్టర్‌ సర్టిఫికెట్స్‌తో పిల్లలను తీసుకొని తల్లి తండ్రులు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9492693431, 9392909770 లో సంప్రదించాలన్నారు.

ఉచిత కంప్యూటర్‌ శిక్షణ

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌ పాఠశాలలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్‌ శిక్షణ ఇస్తున్నారు. దీనికి సంబంధించి తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడునెలల పాటుగా సెట్విన్‌ పాఠ్యాంశాల ఆధారంగా కంప్యూటర్‌ బేసిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌ అర్హతగా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు కుషాయిగూడలోని సరస్వతీ శిశుమందిర్‌ పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు. ఇతర వివరాల కోసం 94912 30181 ఫోన్‌ నెంబరు అందుబాటులో ఉంటుందన్నారు.

డిక్షనరీల పంపిణీ


విద్యార్థినులకు డిక్షనరీల పంపిణీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. క్లాప్‌ ఫౌండేషన్‌ నిర్వాహకుడు టిఎల్‌రెడ్డి రాధాకృష్ణన్‌ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 399 మంది విద్యార్థులకు ఉపయోగపడే డిక్షనరీలను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌, దుర్గయ్య, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

56 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం



బోడుప్పల్‌: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారికి శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని 56 రకాల మిఠాయిలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మ సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే అమ్మగా, ధ్యానిస్తే ధనాభివృద్ధిని, స్మరిస్తే ఐశ్వర్య సిద్ధిని కల్పించే తల్లిగా దర్శన భాగ్యం కల్పిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌ శర్మ వెల్లడించారు.

వృత్తి విద్యా కోర్సులతో భవితకు భరోసా

- సెట్విన్‌లో శిక్షణ పొందిన 300 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన అధికారులు
- 27 నుంచి కొత్త బ్యాచ్‌ ప్రారంభం : పీర్జాదిగూడ సెట్విన్‌ ఇన్‌చార్జి వనజ


పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో తెలంగాణ యూత్‌ సర్వీస్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెట్విన్‌ సెంటర్‌లో హైదరాబాద్‌ నగరంలోని వివిధ సెట్విన్‌ కేంద్రాల్లో శిక్షణ పొందిన సుమారు 300ల మంది యువతీ యువకులకు శుక్రవారం నిర్వహించిన పరీక్షలను మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు, సెట్విన్‌ ఇంచార్జి వనజ కలిసి పరిశీలించారు. నేటి యువతకు సెట్విన్‌ ఓ వారధిలా మారి ఉద్యోగ, ఉపాధి మార్గాల వైపు అడుగులేసి విజయాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. పీర్జాదిగూడ సెట్విన్‌ కేంద్రంలో బ్యూటీషియన్‌, ఫ్యాషన్‌ డిజైనింగ్‌, మగ్గం వర్క్‌, టైలరింగ్‌, జూట్‌ బ్యాగుల తయారీ, ఏసి, రిఫ్రిజిరేటర్‌ తదితర–22 రకాల కోర్సులల్లో శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిని పొందుతున్నారని వనజ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు ఇంచార్జి వనజ తెలిపారు. ఈ నెల 27 నుంచి కొత్త బ్యాచ్‌ ప్రారంభం అవుతున్నందున ఆసక్తి గల వారు. పూర్తి వివరాలకోసం 7207816959 నెంబర్‌ను సంప్రదించగలరని వనజ తెలిపారు.

చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి


చెరువు సందర్శిస్తున్న మేయర్‌, అధికారులు

బోడుప్పల్‌: చెరువుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. హెచ్‌ఎండిఏ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం బోడుప్పల్‌లోని చెరువులను సందర్శించి, స్థానిక సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మేయర్‌ అజయ్‌ యాదవ్‌ మాట్లాడుతూ త్వరలోరా చెరువు, చింతల చెరువును సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కబ్జాదారుల నుంచి పూర్తిస్థాయిలో చెరువులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ మేనేజర్‌ అఫ్రీన్‌, డీఈ జగన్‌ మోహన్‌రావు, డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్‌, సింగిరెడ్డి పద్మారెడ్డి, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, పులకండ్ల హేమలతా జంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దోశలో బొద్దింక

శ్రీరాఘవేంద్ర హోటల్‌లో ఘటన


బొద్దింకను చూపిస్తున్న బాధిత మహిళ, (ఇన్‌సెట్‌లో దోశలో వచ్చిన మాడిన బొద్దింక)

మేడిపల్లి: దోమలో బొద్దింక వచ్చిన సంఘటన శుక్రవారం పీర్జాదిగూడలో చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మేడిపల్లి మండలం పీర్జాదిగూడ వరంగల్‌ జాతీయ రహదారిపై ఉన్న శ్రీరాఘవేంద్ర హోటల్‌కు వచ్చిన ఓ కుటుంబం టిఫిన్‌ చేద్దామని దోశను ఆర్డర్‌ చేయగా దోసలో మాడిన బొద్దింక దర్శనం ఇచ్చింది. దీంతో కంగుతిన్న వారు హోటల్‌ సిబ్బందిని నిలదీసి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తినే ఆహారంలో బొద్దింక కనిపించిందని, ఇలాంటి ఆహారాన్ని వడ్డించి ప్రజల ప్రాణాలలో చెలగాటమాడుతున్నారని హోటల్‌ సిబ్బందిని కస్టమర్లు నిలదీశారు. ఎన్ని తనిఖీలు నిర్వహించినా నిర్వాహకుల్లో మార్పు రావడం లేదని వాపోయారు. ఫుడ్‌ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించడం వల్లనే హోటల్‌ల్లో కనీస సుచి, శుభత పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్న పలు ఫుడ్‌ తయారీ, హోటల్‌ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని హోటల్‌ లైసెన్సు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, కస్టమర్లు కోరారు.

ఉప్పల్‌ రింగ్‌ రోడ్డులో వాహన తనిఖీలు


వాహనాల డాక్యుమెంట్లను చెక్‌ చేస్తున్న డీసీపి మనోహర్‌, ఇతర అధికారులు

ఉప్పల్‌: ప్రతీ వాహనదారుడు విధిగా తన వాహనానికి సంబంధించిన పూర్తి పత్రాలు తన వద్ద ఉంచుకోవాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్‌ చేయనున్నట్లు డీసీపి–1 మనోహర్‌ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉప్పల్‌ రింగ్‌ రోడ్డులో మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీ మాధవి, అడిషనల్‌ ఇన్‌స్పెక్టర్‌ సూర్యానాయక్‌లతో కలిసి వాహనాల డాక్యుమెంట్లను చెక్‌ చేశారు. దాదాపుగా 150 వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలకు ఫైన్‌ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌. రఘురాం, ఉదయ్‌ భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో కార్పొరేటర్‌ శాంతి పర్యటన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ పరిధిలో శుక్రవారం కార్పొరేటర్‌ శాంతి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. కొత్త చెరువు బతుకమ్మ పాండ్‌ వద్ద రూ. 22 లక్షల వ్యయంతో జరుగుతున్న పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కొత్త చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క పనులను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్‌ను కోరారు. అదే విధంగా రాజీవ్‌ వీకర్‌ సెక్షన్‌లో ఆమె పర్యటించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగౌడ్‌, ప్రేమ్‌కుమార్‌, రాజేందర్‌, రహమత్‌ఖాన్‌, సయ్యద్‌ ఆరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల వల్ల వివిధ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా శనివారం ఉండదని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. 11 కేవీ కృపానంద్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆనంద్‌బాగ్‌ వెస్ట్‌, ఏడీఆర్‌ ఆస్పత్రి ఏరియా, కృపానంద్‌ అపార్ట్‌మెంట్స్‌ ప్రాంతాల్లో, 11 కేవీ ఈస్ట్‌ చంద్రగిరి కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు లాల్‌వాణీనగర్‌, చంద్రగికి కాలనీ, వినాయకనగర్‌ ప్రాంతాల్లో, 11 కేవీ పీబీ కాలనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పూలవల్లి బాలయ్య కాలనీ, నవభారత్‌కాలనీ ప్రాంతాల్లో, 11 కేవీ అనంత సరస్వతీనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనంత సరస్వతీనగర్‌, షిర్డీనగర్‌ ప్రాంతాల్లో,11 కేవీ ఎన్‌ఎండీసీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్‌ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్‌ ఈస్ట్‌, బ్యాంక్‌ కాలనీ, తాళ్లబస్తీ, ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. దీనిని గమనించి వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

బోడుప్పల్‌లో...

బోడుప్పల్‌: 11 కేవీ దేవేందర్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో శనివారం విద్యుత్‌ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు అంబేడ్కర్‌నగర్‌, దేవేందర్‌నగర్‌, గౌతమ్‌నగర్‌, ఇందిరానగర్‌, జ్యోతినగర్‌, గణేష్‌నగర్‌, వీరారెడ్డినగర్‌, సీసీఎంబి కాలనీ, అన్నపూర్ణ కాలనీ, రాజీవ్‌నగర్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అలాగే అయ్యప్పస్వామి ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు ఈస్ట్‌ బాలాజీ హిల్స్‌, బాలాజీ హిల్స్‌, పద్మావతి కాలనీ, వెస్ట్‌ బాలాజీ హిల్స్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండ దన్నారు.

సరస్వతినగర్‌ ఫీడర్‌ పరిధిలో ...

విద్యుత్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సరస్వతినగర్‌, విజయపురి, రామిరెడ్డినగర్‌, ఈస్ట్‌ హనుమాన్‌నగర్‌, ఉదయ్‌నగర్‌, అశోక్‌నగర్‌, ప్రశాంత్‌నగర్‌ల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అలాగే బృందావన్‌ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, లక్ష్మీనగర్‌, ఆకృతి టౌన్‌షిప్‌, కేశవనగర్‌ల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు వద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులో రూ. 20 వేలు చోరీ

ఉప్పల్‌: చెంగిచర్ల డిపోకు చెందిన ఆర్టీసి బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుని వద్ద ఉన్న రూ. 20 వేలు కొట్టేసిన సంఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెంగిచర్ల ప్రాంతానికి చెందిన పురుషోత్తం రెడ్డి (75) పని మీద ఆర్టీసీ క్రాస్‌ రోడ్డుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఉప్పల్‌లో చెంగిచర్ల డిపోకు చెందిన 71 ఎ బస్సును ఎక్కాడు. బస్సులో బాగా రద్దీ ఉండటంతో అదే సమయంలో అక్కడే ఫుట్‌ బోర్డుపై మాటు వేసిన ముగ్గురు యువకులు పురుషోత్తం రెడ్డిని లోనికి వెళ్లనీయకుండా అడ్డు నిలుచున్నారు. ఉప్పల్‌ నుంచి నల్ల చెరువు చేరుకునే సరికి అతని జేబులో ఉన్న రూ. 20 వేలు కొట్టేశారు. పురుషోత్తంరెడ్డి గమనించేలోపు ఇద్దరు రన్నింగ్‌ బస్సు నుంచి దిగి పారిపోయారు. ఇంతలోనే అప్రమత్తమైన డ్రైవర్‌, కండక్టర్లు చెరువు కట్ట మీద బస్సు నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు వస్తున్న సమాచారం తెలుసుకున్న మరో వ్యక్తి పారిపోతుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా పారిపోయిన వారు కూడా వచ్చి దొంగిలించిన సొత్తును అప్పగించారు. దీంతో పోలీసులు పోయిన డబ్బును తిరిగి పురుషోత్తంకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాప్రా సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌గా జగన్‌

కాప్రా: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కాప్రా సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌గా జగన్‌ నియమితులయ్యారు. ఇప్పటి వరకు కాప్రా డీసీగా విధులు నిర్వహించిన పి.ముకుందరెడ్డిని శేరిలింగంపల్లి జోన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖైరతాబాద్‌ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జగన్‌ను కాప్రా సర్కిల్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి


నాచారం ఇన్‌స్పెక్టర్‌ వినతి పత్రం అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కోరుతూ నాచారం ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌ కుమార్‌కు మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల విచ్చలవిడి తనం రోజురోజుకూ పెరిగుతుందని పోలీసులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. యువత గంజాయి, మద్యానికి దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. వినతి పత్రం అందజేసిన వారిలో పీఆర్‌. ప్రవీణ్‌, భూమండ్ల శ్రీశైలం, రఘు, నాగరం చంద్రశేఖర్‌, మహేష్‌,మచ్చ శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో విద్యార్థులు

మల్లాపూర్‌: నాచారం డక్కన్‌ స్ప్రింగ్స్‌ గ్లోబల్‌ స్కూల్లో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలను అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉట్టి వేడుకల్లో విద్యార్థులందరూ సంబురంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్‌ నవనీతరావు, మేనేజింగ్‌ డైరెక్టర్‌ నవీన్‌కుమార్‌, కిషోర్‌ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ సుమ మీనన్‌ పాల్గొన్నారు.

